# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం | 3 ఏప్రిల్ 2026 | ■ 11 పేజీలు




## భక్తిశ్రద్ధలతో..
# హనుమాన్ శోభాయాత్ర

వపనసుత.. భక్త హృది విజేత

- జిల్లా వ్యాప్తంగా మారుమోగిన ఆంజనేయ నామస్మరణ...
- ఉమ్మడి జిల్లాలో భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన ప్రజాప్రతినిధులు
- పల్లకి సేవలో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- తరలివచ్చిన భక్తజనం ■ పోలీసుల భారీ బందోబస్తు
- అత్యాధునిక కెమెరాలు, డ్రోన్‌లతో పర్యవేక్షణ

హనుమత్ భక్తుల కోలాహలం.. మంగళవాయిద్యాలు.. డీజే మోతలు, కాషాయ జెండాలతో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా సాగింది.. గురువారం హనుమజ్జయంతి సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో హనుమాన్ విగ్రహ శోభాయాత్ర ఘనంగా చేపట్టారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, ఎస్పీ అఖిల్ మహాజన్, శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామితో కలిసి యాత్రను ప్రారంభించారు. ఈ శోభాయాత్రకు హాజరైన అశేష భక్తజనంతో పట్టణంలోని పురవీధులు కిటకిటలాడాయి. జై హనుమాన్.. జై శ్రీరామ్ అంటూ నినాదాలతో మారుమోగింది. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ భారీ బందో బస్తును ఏర్పాటు చేశారు. సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.



10



11

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- పారదర్శకంగా ఇందిరమ్మఇళ్ల ఎంపిక ■ రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు
- ఉట్నూరు గ్రామసభలో కలెక్టర్ రాజర్షిషా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హామీ
- రూ.220 కోట్లతో 16 వేల ఇళ్ల మంజూరు ■ ఐదేళ్లలో సొంతింటి కల సాకారం
- యువతకు శిక్షణ.. మహిళలకు తోడ్పాటు ■ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌తో ఉపాధి

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ప్రజాపాలన-ప్రగతి నివేదికలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రాష్ట్ర గీతం ఆలపించి ప్రారంభించారు. అనంతరం సీఎం సందేశాన్ని చదివి వినిపించాగా, పలువురు సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారులు వారి అభిప్రాయాలను వెల్లడించారు.

## 'దుర్గా భవాని'
# మిల్లులో రేషన్ దందా

ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చాలని పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపమో లేక రాజకీయ అండదండలో కానీ కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో బియ్యం మాఫియా బరితెగించి ప్రవహిస్తోంది. తాజాగా వేంపల్లిలోని దుర్గా భవాని రైస్ మిల్‌పై జరిగిన దాడి ఈ అక్రమ దందాను మరోసారి బహిర్గతం చేసింది. బుధవారం రాత్రి సిర్పూర్ ఎస్ఐ సాగర్ మరియు టాస్క్ ఫోర్స్ అధికారులు నమ్మదగిన సమాచారంతో దుర్గా భవాని రైస్ మిల్‌పై విరుచుకుపడ్డారు.





# పిప్రికి సీఎం రేవంత్ రాక

- 'పీపుల్ మార్చ్' వేడుకకు భారీ ఏర్పాట్లు
- డిప్యూటీ సీఎం భట్టి పాదయాత్ర స్మృతులు
- 6న పిప్రి గ్రామంలో భారీ బహిరంగ సభ
- డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్
- ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ సోయం బాపురావు, డీసీసీ అధ్యక్షుడి పిలుపు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క బజార్హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామం నుండి చేపట్టిన పీపుల్ మార్చ్ పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 6న సీఎం రేవంత్ రెడ్డి పిప్రి గ్రామానికి రానున్నారని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తెలిపారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సోయం బాపురావ్, పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఈనెల 3న జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు రానున్నట్టు తెలిపారు.

11



# దొంగనోట్ల కేసులో పురోగతి

లక్షెట్టిపేటలో కలకలం సృష్టించిన నకిలీ నోట్ల చలామణి కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించారు. బుధవారం రాత్రి మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ వివరాలను వెల్లడించారు.



## ప్రజల సంక్షేమమే పాలకుల ధ్యేయం

# సభలతోనే సమస్యల పరిష్కారం





- టేకుమట్ల గ్రామసభలో కలెక్టర్ కుమార్ దీపక్
- 99 రోజుల ప్రగతి ప్రణాళికపై సీఎం సందేశం..
- మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్ల వరకు సంక్షేమ పథకాలు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పకడ్బందీ చర్యలు
- విద్య, వైద్య రంగానికి పెద్దపీట
- మధ్యాహ్న భోజనం ఇంటర్ వరకు విస్తరణ
- స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక ప్రోత్సాహం

**జైపూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రభుత్వం గురువారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గ్రామ సభ/వార్డు సభల నిర్వహణలో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుచరిత, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ లతో కలిసి హాజరై 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరిగాయని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులు, మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులు, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందు కొరకు ప్రభుత్వం 13వేల కోట్ల రూపాయల ఖర్చు చేసిందని తెలిపారు. ఈ నెలలో 3 నెలల రేషన్ బియ్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రాష్ట్రమంతట మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అవకాశం కల్పించడం జరిగిందని, తద్వారా ఇప్పటి వరకు 10 వేలకోట్ల రూపాయలు మహిళలకు ఆదా అయ్యాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు వడ్డీలేని రుణాలు కల్పించి వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సహించడం జరుగుతుందని, రుణం పొందిన సంఘాల సభ్యులు సకాలంలో తిరిగి చెల్లించి మళ్లీ రుణం పొందవచ్చని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు భాగస్వామ్యం కల్పించడం జరిగిందని, విద్యార్థుల ఏకరూప దుస్తులు తయారుచేసే అవకాశం కల్పించడం జరిగింది తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రుణమాఫీ కల్పించి రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలను కుటుంబ పెద్దగా గుర్తించి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది నూతన లబ్ధిదారులకు పింఛన్లు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా జిల్లాలోని దాదాపు 6 వేల నుండి 7 వేలమంది లబ్ధిదారులకు పింఛన్లు అందుతాయని, దివ్యాంగుల పింఛన్ల మంజూరులో దివ్యాంగత్వ పరీక్షల ధ్రువపత్రం ఆధారంగా అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందని, దాదాపు 3 వేల ఇండ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 300 ఇండ్లు పూర్తి చేయబడి బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలలో అల్పాహార పథకం కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల దివ్యాంగులకు మోటారు సైకిళ్ళు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్నిబట్టి పంట మార్పిడి విధానాన్ని అమలుచేసి ఆర్థికంగా లబ్ధి పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించి ఆయిల్ పామ్, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై వివరించడం జరుగుతుందని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల నిర్వహణ, పారిశుద్ధ్య అమలు, త్రాగునీటి సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా సీజనల్, అంటు వ్యాధులను నియంత్రించి ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంపొందించవచ్చని తెలిపారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా చెన్నూర్ ప్రాంతంలో బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కుటుంబ భీమా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- కానిస్టేబుల్ కుటుంబసభ్యులకు రూ.లక్ష చెక్కు అందజేత
- గుండెపోటుతో మరణించిన రాథోడ్ విలాస్
- ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణ
- కార్పస్ ఫండ్‌లో లక్ష రూపాయల చెక్కును కానిస్టేబుల్ భార్య జ్యోతికి అందజేత

**ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. ఈ సంవత్సరం జనవరి 5న ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తున్నటువంటి 2012 బ్యాచ్ కానిస్టేబుల్ రాథోడ్ విలాస్(35) గుండెపోటు రావడంతో పరమపదించడం జరిగింది. స్వర్గస్తులైన కానిస్టేబుల్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక సహాయంలో భాగంగా ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయం నందు రాథోడ్ విలాస్ కుటుంబ సభ్యులైన భార్య జ్యోతి మరియు అన్నయ్య కైలాష్ లకు జిల్లా పోలీసులు ముఖ్య కార్యాలయం నుండి కార్పస్ ఫండ్ కింద వచ్చిన లక్ష రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. కానిస్టేబుల్ మరణం పోలీసు వ్యవస్థకు తీరని లోటుని, బాధిత కుటుంబ సభ్యులకు పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉంటూ అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా రావలసిన ప్రతి ఒక్క లబ్ధి త్వరగా చేకూర్చేలా సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదే విధంగా పోలీసు శాఖ తరపున కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ సులోచన, సీసీ కొండ రాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా

# కలిసిన నూతన ఆర్టీసీ ఆర్ఎం

### జిల్లాలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

### ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రాంతీయ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి. విజయ భాను గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో, కలెక్టర్‌కు ఆమె పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆర్టీసీ సేవల విస్తరణ, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు మరియు సంస్థ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయ భానును కలెక్టర్ అభినందిస్తూ, జిల్లా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని సూచించారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్టీసీని లాభాల బాటలో నడిపిస్తూనే, సామాన్య ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా చూస్తానని, అధికారుల సమన్వయంతో విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీకి చెందిన పలువురు ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.

### నర్సరీలో మామిడి

# బహిరంగ వేలం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

కన్నాల గ్రామంలోని ప్రభుత్వ ఉద్యాన నర్సరీలో మామిడి కాయల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఉద్యాన అధికారి అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలోని సుమారు 300 మామిడి చెట్ల దిగుబడికి సంబంధించి ఈ నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు నర్సరీ ప్రాంగణంలోనే వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు రూ. 1,000 డిపాజిట్ చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం అత్యధిక ధర పలికిన వారికి ఈ దిగుబడిని కేటాయించడం జరుగుతుందని వెల్లడించారు. వివరాల కోసం కన్నాలలోని ఉద్యాన నర్సరీ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు కోరారు.

# కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

### పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



**నిర్మల్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పీడిత వర్గాల కొరకు పోరాటాలు చేసిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఇటువంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, బిసి, మైనారిటీల సంక్షేమ అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్, డీఈవో భోజన్న, పలువురు కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ప్రజల సమస్యలు తెలుసుకుని

# పరిష్కరించేందుకే గ్రామ సభ

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**తాండూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండలం కిష్టంపేట, తాండూర్ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలకు అధికారులతో కలిసి హాజరై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపల్ కార్పొరేషన్ లోని డివిజన్లు, మున్సిపాలిటీలలోని వార్డులలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని, ఈ పథకాల ప్రగతి వివరాలను ప్రజలకు వివరించి పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామసభలు, వార్డు సభల ద్వారా ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సాహం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యుత్, పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

---

## కార్పొరేటర్ రంగంలో ఇంటర్న్‌షిప్

**పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్**

**మంచిర్యాల, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
కార్పొరేటర్ రంగంలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించేందుకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడం జరుగుతుందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని అర్హత కలిగిన యువతకు ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ (రౌండ్ 3) పథకం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేయడం జరుగుతుందని, ఈ పథకం ద్వారా దేశంలోని ప్రముఖ సంస్థలలో చెల్లింపుతో కూడిన ఇంటర్న్‌షిప్‌ల ద్వారా పరిశ్రమల అనుభవం, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు 6 / 9 నెలల ఇంటర్న్‌షిప్ కాలం ఉంటుందని, ప్రతి నెల తగిన ఆర్థిక సహాయం అందించి ప్రముఖ కంపెనీలలో ప్రత్యక్ష అనుభవం పొందే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలని, అభ్యర్థులు పూర్తిగా ఉద్యోగంలో ఉండకూడదని తెలిపారు. యువతలో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి, కార్పొరేట్ రంగంలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించడానికి ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 2026-27 సంవత్సరానికి గాను https://pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నం.1800 116090లో సంప్రదించవచ్చని తెలిపారు.

## అంజన్నకు మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు దేవాలయాలను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సందర్శించారు. గురువారం కేస్లాపూర్, టీఆర్‌నగర్, బజార్‌వాడిలోని ప్రాంతాల్లో ఉన్న హనుమాన్ ఆలయాలకు వెళ్లిన ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి



**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
వేసవికాలం సమీపిస్తున్నందున ప్రజలకు త్రాగునీటి సమస్యలు లేకుండా ముందస్తుగా చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపాలిటీలో అమృత్ 2.0 పనుల పురోగతిని ఆకస్మికంగా సందర్శించి పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న త్రాగునీటి సరఫరా, పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం అయినందున ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ డి.ఈ.ఈ.ను ఆదేశించారు. పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించడమే అమృత్ 2.0 లక్ష్యమని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సమయపాలనతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




### ఖానాపూర్‌లో

# మున్సిపల్ సెగ

**బీఆర్ఎస్ కౌన్సిలర్ మేసు పోసమ్మ అపహరణ!**

**చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల వేళ పొలిటికల్ హీట్**

**క్యాంప్‌లో ఉండగానే కిడ్నాప్‌కు గురైనట్లు ఫిర్యాదు**

**పోలీసులను ఆశ్రయించిన బీఆర్ఎస్ నేతలు..**

**తక్షణమే విడుదల చేయాలని డిమాండ్.**

**4న పట్టణ బంద్‌కు గులాబీ శ్రేణుల హెచ్చరిక**

**ఖానాపూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ పురపాలక సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఈ నెల4న జరగనున్న నేపథ్యంలో ఖానాపూర్‌లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్ మేసు పోసమ్మ, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో పార్టీకి చెందిన ఇతర కౌన్సిలర్లతో కలిసి క్యాంపులో ఉన్న సమయంలో కొంతమంది దుండగులు ఆమెను కిడ్నాప్ చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటన పై గురువారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఖానాపూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ అజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో ఖానాపూర్ రాజకీయాలు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల తీర్పును గౌరవించకుండా ప్రజా ప్రతినిధులను అపహరించడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని తీవ్రంగా ఖండించారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధిని కిడ్నాప్ చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. తక్షణమే మేసు పోసమ్మను సురక్షితంగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 4న జరగనున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల రోజున ఖానాపూర్ పట్టణాన్ని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో అష్టదిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ రాం నాయక్, గోరేకారి రాజు, సక్కారం శ్రీనివాస్, శనిగరపు శ్రవణ్, కారింగుల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మారువేషంలో వెళ్లి 'పేకాట' గుట్టురట్టు

- పోలీసుల మెరుపు దాడి!
- దుగ్నేపల్లి శివారులో పేకాట రాయుళ్ల పట్టివేత
- ఏసీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన సిఐ, ఎస్ఐ
- పంటచేల గుండా 13 మంది పరారీ
- నలుగురు అరెస్ట్.. రూ. 36 వేల నగదు, మూడు బైకులు స్వాధీనం



**చెన్నూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం దుగ్నేపల్లి శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ శ్యామ్ పటేల్‌లు మారువేషంలో పోలీసు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు, దాడ జంపయ్య, మేకల రాంచందర్, గజ్జెల రజినీకాంత్, దెబ్బ హరీష్‌లను అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. మిగతా 13 మంది పంటచేనుల గుండా పారిపోయినట్లు వెల్లడించారు. పట్టుబడిన వారి వద్ద నుంచి నగదు రూ. 36,000/-, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు బైకులు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పారిపోయిన మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని త్వరలోనే అరెస్టు చేసి, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఎవరైనా పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# నేడు ఆసిఫాబాద్‌కు టీపీసీసీ బాస్

- పార్టీ శ్రేణులకు 'సుగుణక్క' పిలుపు - మహేష్ కుమార్ గౌడ్ పర్యటనను విజయవంతం చేయాలి
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ - జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం
- రోజ్ గార్డెన్‌లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం - నియామక పత్రాల అందజేత
- హాజరుకానున్న మంత్రి జూపల్లి - పార్టీ బలోపేతమే లక్ష్యంగా దిశానిర్దేశం చేయనున్న రాష్ట్ర నాయకత్వం



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జిల్లాపర్యటన నేపథ్యంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ మాట్లాడారు. ఏప్రిల్ 3న మధ్యాహ్నం 12 గంటలకు ఆసిఫాబాద్‌లోని రోజ్ గార్డెన్‌లో జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఫైర్స్ కమిటీ సభ్యులు, అలాగే పార్టీ అనుబంధ సంఘాలైన యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, సేవాదళ్, కిసాన్ కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, సభ్యులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు,ముఖ్య కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని సుగుణక్క పిలుపునిచ్చారు.పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, కార్యవర్గ సభ్యులకు దిశానిర్దేశం చేయడం లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించి, నియామక పత్రాలను అందజేస్తారని వెల్లడించారు.ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ,నాయకులు గాదెవేణి మల్లేష్, సత్యనారాయణ, పెందూర్ సుధాకర్, సిడాం తిరుపతి, తారీక్ బాయ్, జక్కన్న, ఇగురపు సంతోష్, బానుచందర్, మారుతీ పటేల్, మోహన్, షేక్ మొహమ్మద్, సంతోష్, సుజిత్, ఆత్రం భీమ్ రావ్, కాశిఫ్ హష్మీ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ జయంతి

**ఖానాపూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి నగర్, హనుమాన్ ఆలయంలో అర్చకులు సందీప్ శర్మ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షులు అడ్డగట్ట రాజన్న, కౌన్సిలర్ నిమ్మల రమేష్, లింగాల లక్ష్మణ్, మురళి ఆధ్వర్యంలో పూ జలు నిర్వహించగా, శ్రీరామ్ నగర్ మంచిర్యాల చౌరస్తా, పంచముఖ హనుమాన్, జంగల్ హనుమాన్ ఆలయాల్లో భక్తులు జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

## ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**నిర్మల్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని బోయవాడ దక్షిణముఖ ఆంజ నేయ స్వామి ఆలయంలో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పూ జలు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే ఆలయాన్ని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చంద్రకాంత్ స్థానిక కౌన్సిలర్ జింక సూరి హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో మహంకాళీ జాతర ఉత్సవాలు ప్రారంభం

**రెబ్బెన, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

చైత్ర పౌర్ణమి సందర్భంగా రెబ్బెన మండలం శ్రీ కనక దుర్గా దేవి స్వయంభూ శ్రీ మహంకాళి దేవస్థానంలో మహంకాళీ అమ్మవారి జాతర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్ జాతర ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల కళ్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి టీటీడీ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు పుసాల మహేష్ శాస్త్రి ఆధ్వర్యంలో శివ పార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజాది కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు.





## నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల, జిల్లా స్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఉపాధి అవకాశాల సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, కార్యాలయాల నోటీసు బోర్డులలో ప్రదర్శించాలని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యాసంస్థల ప్రిన్సిపాల్ లు అర్హులైన విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు సమాచారం అందించాలని తెలిపారు. పలు దేశాలలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అర్హత గల మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జర్మనీ దేశంలో నర్సింగ్, ఎలక్ట్రికల్/పవర్ లైన్ టెక్నీషియన్ ఉద్యోగాలు, ఖతర్- దోహా దేశంలో నర్సింగ్ ఉద్యోగాలు, గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ, హౌస్ కీపింగ్, వెయిటర్లు, బార్బెండర్లు, వంట మనుషులు, హోటల్ రిసెప్షనిస్ట్, స్పా థెరపిస్టులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, లైఫ్ గార్డులు, గార్డెనర్లు, బెల్ బాయ్స్, ఫిషర్ మెన్ ఇతర ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి అర్హత గల మైనారిటీ అభ్యర్థులు తమ బయోడేటా/సివిను వెంటనే tomcomglobal @gmail.com, tomcom.resume@gmail.com లకు మెయిల్ చేయవచ్చని, వివరాలకు 9440048590, 9440049937, 9440051452, 8919047600 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.




## లక్ష్యం 'టిబి' రహిత సమాజం

### గుడమామడలో ప్రత్యేక వైద్య శిబిరం!

**జైనూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం గుడమామడ గ్రామంలో 'టిబి ముక్త భారత్' అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం స్థానిక పీహెచ్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, టిబి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామ ప్రజలకు దగ్గు ఎక్కువ రోజులు కొనసాగితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. టిబి వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, మందులను మధ్యలో ఆపకుండా క్రమంగా తీసుకోవాలని వివరించారు.శిబిరంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని గ్రామ సర్పంచ్ కొమురం యశోద ప్రజలను కోరారు.

## మండల వ్యాప్తంగా ప్రజాపాలన గ్రామసభలు

**వాంకిడి, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం వాంకిడి మండల వ్యాప్తంగా 28 గ్రామపంచాయతీలో సర్పంచుల అధ్యక్షతన ప్రత్యక గ్రామసభలు చేపట్టారు. గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, సంక్షేమ ఫలాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి గ్రామ సభ ద్వారా తీర్మానాలు చేశారు. అనంతరం గ్రామ సభకు హాజరైన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని, దరఖాస్తులను గ్రామల సర్పంచ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.



## లక్షెట్టిపేట దొంగనోట్ల కేసులో పురోగతి

- మరో ముగ్గురు ముఠా సభ్యుల అరెస్ట్
- తప్పించుకున్న నిందితులను పట్టుకున్న పోలీసులు
- రూ. 61,000 విలువైన నకిలీ నోట్లు స్వాధీనం
- ఇటిక్యాల సమీపంలో అదుపులోకి తీసుకున్న వైనం
- ఇప్పటికే 12 మంది అరెస్ట్.. తాజాగా కాకినాడ, గోదావరిఖని వ్యక్తుల పట్టివేత
- వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాష్



**లక్షెట్టిపేట, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

లక్షెట్టిపేటలో కలకలం సృష్టించిన నకిలీ నోట్ల చలామణి కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం రాత్రి మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ వివరాలను వెల్లడించారు. నకిలీ నోట్ల చలామణి కేసులో గతంలో 12 మందిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు పక్కా సమాచారంతో పట్టుకున్నారన్నారు. పరారీలో ఉన్న కోదండరావు (కాకినాడ), రవి (పశ్చిమ గోదావరి జిల్లా), శ్రీనివాస్ (గోదావరిఖని) లను ఇటిక్యాల సమీపంలో సిఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ బృందం చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితుల వద్ద నుంచి 61,000 రూపాయల విలువ గల 500 నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని, వీటితో పాటు నేరానికి ఉపయోగించిన నాలుగు సెల్ ఫోన్లను కూడా జప్తు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనునట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ‘దుర్గా భవాని’ మిల్లులో రేషన్ దందా



- టాస్క్‌ఫోర్స్ దాడిలో బియ్యం పట్టివేత!
- బట్టబయలైన బియ్యం మాఫియా గుట్టు
- ప్రభుత్వ గోనె సంచుల్లోనే అక్రమ నిల్వలు
- విస్తుపోయిన అధికారులు...
- పోలీసుల కళ్లుగప్పి డీసీఎం మాయం
- తనిఖీల ముందే లీకైన సమాచారం?
- అదృశ్య శక్తిపై అనుమానాలు
- సోషల్ మీడియాలో ‘గజ్జల’ కలకలం
- స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరు?
- అధికారుల విచారణ షురూ

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చాలని పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపమో లేక రాజకీయ అండదండలో కానీ కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో బియ్యం మాఫియా బరితెగించి ప్రవహిస్తోంది. తాజాగా వేంపల్లిలోని దుర్గా భవాని రైస్ మిల్‌పై జరిగిన దాడి ఈ అక్రమ దందాను మరోసారి బహిర్గతం చేసింది. బుధవారం రాత్రి సిర్పూర్ ఎస్ఐ సాగర్ మరియు టాస్క్ ఫోర్స్ అధికారులు నమ్మదగిన సమాచారంతో దుర్గా భవాని రైస్ మిల్‌పై విరుచుకుపడ్డారు. ఈ తనిఖీల్లో సుమారు 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే, పోలీసులు వస్తున్నారనే సమాచారం ముందే పాకిందో ఏమో కానీ మిల్ ఆవరణలో లోడుతో సిద్ధంగా ఉన్న ఒక డీసీఎం వాహనం క్షణాల్లో అక్కడి నుంచి మయం చేశారు. పోలీసుల కళ్లు గప్పి ఆ వాహనం వెళ్ళిపోయింది అంటే ఆ వాహనం వెనుక ఉన్న ఆ అదృశ్య శక్తి ఎవరు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా గజ్జల అనే పేరు మారుమోగిపోతోంది. ఈ అక్రమ బియ్యం రవాణాలో ఈ గజ్జల పాత్ర ఏంటి పట్టుబడ్డ బియ్యం నేరుగా ప్రభుత్వ గోనె సంచుల్లోనే ఉండటాన్ని బట్టి చూస్తే, ఇది కేవలం డీలర్ల దగ్గరి నుండి సేకరించింది మాత్రమే కాదని ఎంఎల్ఎస్ పాయింట్ల (మండల నిల్వ కేంద్రాల) లేదా రేషన్ డీలర్ల నుండే నేరుగా మిల్లుకు చేరుతోందని స్పష్టమవుతోంది. గత కొద్దిరోజుల క్రితమే జిల్లా కలెక్టర్ హరిత రైస్ మిల్లర్ల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అప్పుడు గొర్రెల్లా తలలు ఊపిన కొందరు మిల్లర్లు బయటకు రాగానే తమ వక్రబుద్ధిని చాటుకుంటున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ అవుతున్న తరుణంలో ఇదే అదనుగా భావించిన దుర్గా భవాని రైస్ మిల్లర్ యాజమాన్యం గజ్జలు మోగేలా భారీ స్కామ్‌కు తెరలేపింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ పేదల బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సొమ్ము చేసుకునే ఈ దందా వెనుక ఎంత పెద్ద అండ ఉందో విచారణలో తేలాల్సి ఉంది. ప్రభుత్వ గోనె సంచులతో బియ్యం మిల్లుకు చేరుతున్నాయంటే, సివిల్ సప్లై అధికారులు ఏం చేస్తున్నారు ఈ గజ్జల వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరు అధికారులు కేవలం సిర్పూర్ స్టేషన్‌లో నిల్వ ఉన్న ఆ 9 క్వింటాళ్ల బియ్యం కేవలం ఆరంభం మాత్రమే ఈ గజ్జల దందా మూలాలను తవ్వితే పెద్ద పెద్ద తిమింగలాలే బయటపడటం ఖాయం అని ప్రజలు అంటున్నారు.



## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

గర్భంలో ఉన్న శిశువు లింగ నిర్ధారణ లేదా గర్భస్రావం చేయడం వంటివి చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు. ఈ చర్యలు సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని. ఆడ శిశువుల సంఖ్య తగ్గడానికి సైతం దారితీస్తున్నాయని చెప్పారు. జిల్లాలోని అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ తోనే పనిచేయాలని. నిబంధనలను పూర్తిగా పాటించాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే డాక్టర్లు, వైద్య సిబ్బంది, మెడికల్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదా పూర్తిగా రద్దు చేయడంతో పాటు సెక్షన్ 22 ప్రకారం 3 నుంచి 5 సంవత్సరం జైలు శిక్షతో పాటు 10 వేల నుంచి 50 జరిమానా ఉంటుందని ఎస్పీ హెచ్చరించారు

## కన్నుల పండువగా రథోత్సవం

**నిర్మల్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పురాతన దేవరకోట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవ వేడుకలువైభవంగా జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం జరిగిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో దేవతా మూర్తుల విగ్రహాలను పూలమాలలతో అందంగా తీర్చిదిద్దారు. మహిళల మంగళహారతులు, బాజా భజంత్రీల నడుమ పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కోర్కెలు తీర్చే వెంకన్నకు భక్తులు ముడుపులు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## సమస్యలు తెలుసుకునేందుకే గ్రామసభలు

**సిర్పూర్ (టి), ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికను ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిందని కలెక్టర్ కె హరిత అన్నారు. మండలంలోని మెట్‌పల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కుడ్మెత భీంరావు అధ్యక్షతన గురువారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు కల్యాణలక్ష్మి, గృహ జ్యోతి, మహిళకు ఉచిత బస్సు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. దీంతో పాటు ఇంకా రానున్న రోజుల్లో ప్రభుత్వం మరో నాలుగు పథకాలు ప్రజలకు అందిస్తుందన్నారు. అందులో ఇంటి పెద్దకు ఇన్సూరెన్స్, పాఠశాల, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ పథకాలను అమలు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ప్రజలు కూడా సంక్షేమ పథకాలను లబ్ధి పొందాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై క్షేత్రస్థాయికి వెళ్లి లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. కొందరు లబ్ధిదారులు ఇసుక కోసం ఇబ్బంది పడాల్సి వస్తుందని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ ఇసుక అందేలా కృషి చేస్తామన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకుని లబ్ధి పొందాలని ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన కలెక్టర్‌ను పూలమాలలు, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. వినోద్, అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ నర్సింహరావు, పంచాయతీ రాజ్ ఈఈ ధర్మేందర్, డీఈ అశ్విన్, ఏఈ అనీల్‌కుమార్, ఏఈవో నేహాతబస్సుం పాల్గొన్నారు.



## మూడు రోజుల పాటు ‘మీసేవ’ సేవలకు అంతరాయం

**సర్వర్ల నిర్వహణ, డేటాబేస్ మైగ్రేషన్ పనుల కారణంగా లావాదేవీల నిలిపివేత**
**ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ ఉదయం వరకు అందుబాటులో ఉండని సర్వీసులు**
**సహకరించాలన్న కలెక్టరేట్ ఈ.డి.ఎం. రవి బండి**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రవ్యాప్తంగా ‘మీసేవ’ కేంద్రాల ద్వారా అందే వివిధ రకాల సేవలకు ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అంతరాయం కలగనుంది. రాష్ట్ర ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ హైదరాబాద్ కార్యాలయ కమిషనర్ ఆదేశాల మేరకు.. మీసేవ సర్వర్ల నిర్వహణ మరియు డేటాబేస్ మైగ్రేషన్ పనులు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ అప్‌డేషన్ పనుల కారణంగా ఏప్రిల్ 3వ తేదీ (శుక్రవారం) రాత్రి 10:00 గంటల నుండి, ఏప్రిల్ 5వ తేదీ (ఆదివారం) ఉదయం 08:00 గంటల వరకు మీసేవ లావాదేవీలు పూర్తిగా నిలిపివేయబడతాయి. ఈ సమయంలో మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి సర్టిఫికెట్లు, దరఖాస్తులు లేదా ఇతర పౌర సేవలు అందుబాటులో ఉండవని జిల్లా కలెక్టరేట్ ఈ.డి.ఎం. రవి బండి ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక మెరుగుదల కోసం చేపడుతున్న ఈ ప్రక్రియను గమనించి, ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. అత్యవసర పనులు ఉన్నవారు ఈ గడువును దృష్టిలో ఉంచుకుని తమ దరఖాస్తులను ప్లాన్ చేసుకోవాలని సూచించారు.



**అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ**

## పథకాల ఫలాలు అందాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రజాపాలనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం సిర్పూర్–టి మండలం మేడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు నరసింహ, ఈఈ ధర్మేంద్రలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్‌లో ఉన్న సమస్యల సత్వర పరిష్కారం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి హామీ పనులు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాల పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు, రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు వంటి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నమోదైన కేసుల వివరాలు, బాధిత మహిళలకు అందిస్తున్న సేవల పై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సఖి కేంద్రానికి వచ్చే బాధిత మహిళల పట్ల సమయానుకూలంగా స్పందించి వారికి న్యాయం చేయాలని సూచించారు. దీని పై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రతి కేసును సున్నితంగా పరిష్కరించడంతో పాటు బాధిత మహిళల గోప్యతను కాపాడుతూ బాధ్యతాయుతంగా పని చేయాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు.

## నకిలీ పత్రాలతో భూమాఫియా ‘ప్లాన్’

**మావాల పోలీసుల చేతికి చిక్కిన నిందితురాలు**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

నకిలీ పత్రాలు సృష్టించి, పక్కా ప్లాన్‌తో భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన భూమాఫియా గుట్టును మావాల పోలీసులు రట్టు చేశారు. ఒక ప్లాట్ నంబర్‌ను మరో ప్లాట్ నంబర్‌తో కలిపి, తప్పుడు రికార్డులు సృష్టించిన వ్యవహారంలో నలుగురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు మావాల ఎస్‌హెచ్‌ఓ రాహుల్ కాంత్ వెల్లడించారు. బాధితుడు మంద జయనారాయణ రెడ్డి కుటుంబం 1991లో దాస్నాపూర్‌లోని సర్వే నం.1లో ప్లాట్ నం.20ని కొనుగోలు చేసింది. యజమానులు తరచూ అక్కడికి రాకపోవడం, మున్సిపల్ మ్యూటేషన్ ప్రక్రియలో జాప్యం జరగడాన్ని ఆసరాగా చేసుకున్న పక్క ప్లాట్ (నం.19) యజమానులు మైసర్ల లక్ష్మి, ఆమె కుమార్తె సిరిపురం రమాదేవి ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు పథకం వేశారు. నిందితులు తమ ప్లాట్ నం.19లో ప్లాట్ నం.20ని కలిపేసి తప్పుడు రికార్డులు సృష్టించారు. 2021లో నకిలీ గిఫ్ట్ డీడ్ పత్రాలు తయారు చేసి ఆస్తిని బదిలీ చేసుకున్నారు. ఆ నకిలీ పత్రాల ఆధారంగా అక్కడ టిన్ షెడ్ నిర్మించడమే కాకుండా, అసలు యజమానిని బెదిరిస్తూ కోర్టు నుంచి ఇంజంక్షన్ ఆర్డర్ కూడా పొందారు. బాధిత యజమాని తన వద్ద ఉన్న అసలు పత్రాలను చూపించినప్పటికీ నిందితులు వెనక్కి తగ్గకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. సోమవారం (ఏప్రిల్ 1) కుచ్లాపూర్ గ్రామంలో ఉన్న సిరిపురం రమాదేవిని పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో ఆమె చేసిన నేరాన్ని అంగీకరించింది. నిందితురాలి నుంచి నకిలీ గిఫ్ట్ డీడ్లు, మున్సిపల్ పన్ను రసీదులతో పాటు 1991 నాటి అసలు సేల్ డీడ్ పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు మైసర్ల లక్ష్మితో పాటు ప్రసన్న, రాణి పరారీలో ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేసిన నిందితురాలిని ఆదిలాబాద్ కోర్టులో హాజరుపరిచారు. భూ లావాదేవీలు జరిపేటప్పుడు పత్రాల నిజానిజాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్లాట్ల యజమానులు ఎప్పటికప్పుడు మ్యూటేషన్లు, పన్నులు చెల్లిస్తూ తమ భూమిపై నిఘా ఉంచాలి. ఎవరైనా అక్రమంగా భూములు ఆక్రమించే ప్రయత్నం చేస్తే వెనుకాడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



## ముఖ్యమంత్రి బాసర పర్యటనను
# విజయవంతం చేయాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 6 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బాసర పర్యటన నేపథ్యంలో, ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం రాత్రి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులంతా సంబంధిత ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం బాసర చేరుకున్న నుంచి, ఆలయానికి చేరుకొని, పూజలు నిర్వహించి, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, తిరిగి వెళ్లేవరకు వివిధ శాఖల అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. హెలిప్యాడ్, ఆలయం లోపల, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయాలన్నారు. ఆలయాన్ని పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు, సంబంధిత ఉద్యోగులు, సిబ్బందికి, వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అంతర్గత శాఖాపరమైన ఆదేశాలు తక్షణమే జారీచేయాలని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ, ముఖ్యమంత్రి బాసర పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఎఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, బాసర ఆలయ ఈవో విజయరామారావు, డిపిఓ శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి ప్రభాకర్, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మౌలిక వసతులపై దృష్టి సారించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
గ్రామాలు, వార్డులలో పారిశుధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రాజంపేట గ్రామ పంచాయతీలో గురువారం 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారంపై ఆమె అధికారులకు దిశానిర్ధేశం చేశారు. అలాగే దశ్నాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రె అకాష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కాగా ఆయా గ్రామపంచాయతీలలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆహ్మద్, రాజంపేట సర్పంచ్ పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌పై వచ్చి మూడు తులాల పుస్తెలతాడు చోరీ

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని బీట్ బజార్‌లో వాసవి మాత ఆలయం సమీపంలో ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం బాధితురాలు కొండ సరోజన ఉదయం 7 గంటల సమయంలో గుడికి వెళ్లేందుకు ఇంటి ముందు చెట్టుకు ఉన్న పూలు తెంపుతుండగా, గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. దొంగిలించిన పుస్తెలతాడు సుమారు మూడు తులాల వరకు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన పై ఎస్సై గోపతి సురేష్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



# సీఎం సభను విజయవంతం చేయండి

- ఖానాపూర్‌ను అభివృద్ధి చేసి చూపిస్తాం
- ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం తలపెట్టిన సీఎం పర్యటనను ప్రజలు విజయ వంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే ,డిసిసి అధ్యక్షులువెడ్మ బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మా ట్లాడారు .పర్యటనలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులకు ప్రమాణ స్వీకారం అనంతరం పర్యటన కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. దీనికి జిల్లాలోని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు .కాగా ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, కొందరు వ్యక్తులు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో అబద్ధపు ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని ఆయన అన్నారు. రాజకీయ లబ్ధి కోసం దుర్బుద్ధితో కొందరు ఖానాపూర్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఉట్నూ ర్కు తరలించుకుపోయానని ఆరోపిస్తున్నారు ఇది సరికాదని, ఈనెల ఆరవ తేదీ తర్వాత 110 ఎకరాల్లో అసైన్డ్ భూ ములు ఎంత ఉందో అధికారులతో సర్వే చేసి ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని, అక్రమంగా భూమి ఆక్రమించుకున్న వారిని తొలగిస్తానని ఆయన అన్నారు. దాని స్థానంలో ఖానాపూర్ కి మోడల్ పాఠశాల, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్, డిగ్రీ కళాశాల, మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కి విన్నవించానని త్వరలోనే వాటికి కూడా మంజూ రు లభిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 4న ఎన్నికల్లో చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కిడ్నాప్ ఉదంతంపై తమకు ఎలాంటి సమాచారం లేదని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు రాజురా సత్యం, నిమ్మల రమేష్, గొర్రె గంగాధర్, జమాల్, తోట సత్యం, దయానంద్, షబ్బీర్ పాష, శంకర్ తదితరులు ఉన్నారు.

# ఇక ఆన్‌లైన్‌లోనే ఇసుక విక్రయాలు



- మాన్యువల్ కూపన్ల విధానం రద్దు!
- 'మన ఇసుక - వాహనం' పోర్టల్ ద్వారానే పంపిణీ
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా కీలక ప్రకటన
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బంపర్ ఆఫర్
- కేవలం రూ. 15/కే ట్రాక్టర్ ఇసుక సరఫరా
- సాధారణ అవసరాలకు రూ. 400 ధర ఖరారు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
మన ఇసుక – వాహనం' పోర్టల్ ద్వారానే ఇసుక విక్రయాలు జరపాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇసుక పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకం చేసేందుకు జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో అమలులో ఉన్న మాన్యువల్ కూపన్ల విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తూ, ఇకపై 'మన ఇసుక – వాహనం' పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్ పద్ధతిలో ఇసుక విక్రయాలు జరపాలని కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. సాధారణ ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ పనుల కోసం ప్రతి ట్రాక్టర్ ఇసుక ధరను రూ.400గా కమిటీ నిర్ణయించడం జరిగిందని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో, వారికి అవసరమైన ఇసుకను రూ.15/– (నామమాత్రపు ధర) రాయితీ ధరకే అందించాలని ఆదేశించారు. జిల్లాలోని నిర్దేశిత క్వారీలు, చెరువుల నుండి ఇసుకను పొందేందుకు ఏప్రిల్ 1, 2026 నుండే ఈ ధరలను అమలు పరచడం జరిగిందని తెలిపారు. వినియోగదారులు తమకు కావలసిన ఇసుకను tgmiv.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న ఎంవీఐ మొబైల్ యాప్ ద్వారా సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మాన్యువల్ కూపన్లు చెల్లవని, కేవలం ఆన్‌లైన్ రశీదులు ఉన్న వాహనాలనే ఇసుక తరలింపునకు అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ పారదర్శక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, మైనింగ్ శాఖ రవీందర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## సఖి కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల సఖి కేంద్రాన్ని గురువారం కలెక్టర్ కె హరిత తనిఖీ చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అందిస్తున్న సేవలు, సదుపాయాలు, నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత వాతావరణం కల్పించి వారి సమస్యలు తక్షణం పరిష్కారం కోసం సఖి కేంద్రం పని చేస్తుందని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, ఆశ్రమం కల్పన వంటి సేవలు అందుతున్నాయని తెలిపారు. సఖి కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించి నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుత స్థితి తెలుసుకున్నారు. ప్రతి కేసులో సమయానుకూలంగా స్పందించి బధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సఖి కేంద్రంలో శుభ్రత, భద్రత, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మహిళలపైన జరుగుతున్న దాడులను, వేధింపులను అరికట్టడంలో సఖి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ అన్నారు. సమాజంలో మహిళలు భయ పడకుండా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జిలా స్థాయి వరకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సఖి కేంద్రం సిబ్బందితో మాట్లాడుతూ మహిళలకు అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకుని ప్రతి కేసును సున్నితంగా పరిష్కరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అన్నారు. మహిళల గోప్యతను కాపాడుతూ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయాలను కొనసాగించాలి



మంచిర్యాల, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, బి. సి. సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తురుష్క సైనికులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని, రాజ్యాధికార సాధనపై ప్రజలలో చైతన్యం కలిగించారని, బానిస ప్రజల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు. మహనీయుల చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వం మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, బి సి సమాజ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఎన్. శ్రీనివాస్, బి. సి. సంఘాల ప్రతినిధి కె.లచ్చన్న, గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధి ముఖేష్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహంకాళి దేవత పూజలు

సిరికొండ, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
అదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని వాయిపేట అటవీ ప్రాంతంలో కొలువుదీరిన మహంకాళి దేవత పూజలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా మహంకాళి దేవత కు పూజలు చేయడం గత 20 సంవత్సరాల నుంచి వస్తున్న అనవాయితీ. మహంకాళి దేవతకు పూజారి కినకా సంభు మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా పూజలకు మహారాష్ట్రలోని నాగపూర్, యువత మాల్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల వివిధ జిల్లాల నుండి భక్తులు హాజరయ్యా రు. భక్తిశ్రద్ధలతో ఆలయం వద్ద మొక్కులను తీర్చుకున్నారు. మహంకాళి దేవత పూజల సందర్భంగా వాలీబాల్ కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు.

## వివాహానికి ఆర్థిక సాయం



తాండూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
తాండూరు గ్రామంలో పేదింటి ఆడపడుచు కంపెల మమత వివాహానికి మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ గురువారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. సర్పంచ్ ముడిమడుగుల సురేష్ రూ.2 వేలు, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ రూ.3వేలు, వార్డు సభ్యులు భాగ్యలక్ష్మి సారయ్య రూ. వెయ్యి సాయంగా అందించారు. వార్డు సభ్యులు పెట్టెం విష్ణుకళ్యాణ్, ఎండీ జుబేర్, సింగరావ్ శ్రీధర్, పురంశెట్టి అరుణ్ పులగం శ్రీకాంత్ రూ. 5వేల ఎయిర్ కూలర్ విరాళంగా అందించి యువతి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఈసా, వార్డు సభ్యులు, నాయకులు, మైనార్టీ నాయకులు పాల్గొని వధువును ఆశీర్వదించారు.

## వైద్యులపై దాడి సరికాదు

నిర్మల్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే వైద్యులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు వైద్య ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. దాడి జరిగిన సంతోష్ రాజ్ ఆసుపత్రిని సందర్శించి ఇటువంటి దాడి జరగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నేరెళ్ల రమేష్ మాట్లాడుతూ సంవత్సరాలుగా రాత్రిపగళ్ళు ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యుడిపై దాడిచేయడం సిగ్గుచేటు అని అన్నారు వైద్యులపై దాడిచేసిన వారిని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి తలకొక్కుల నరహరి కోశాధికారి చక్రి కార్యదర్శి రాకేష్ రమేష్ విజయ్ ప్రశాంత్ తదితరులు పాల్గున్నారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నార్నూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్ అన్నారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలంలోని 48 గ్రామపంచాయతీ కార్యాలయాలలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామసభను సర్పంచుల అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ గ్రామ సభలో ప్రభుత్వ పథకాలు, సంక్షేమం తీరుపై చర్చించారు. గ్రామ సభలలో ప్రభుత్వం అమలు చేస్తున్న అరకొర పథకాల అమలు తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామసభలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నత అధికారులకు నివేదిస్తామని గ్రామసభలలో అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి ఎంపీడీవో రాథోడ్ గంగా సింగ్, సర్పంచులు బానోత్ కావేరి, తోడసం రేణుక, ఉప సర్పంచ్ మహ్మద్ ఖురేషి, పంచాయతీ కార్యదర్శులు, హాయ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తలంబ్రాలు బుకింగ్‌లో జోన్ స్థాయిలో ఆదిలాబాద్ ప్రథమ స్థానం



ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి తలంబ్రాల బుకింగ్స్‌లో ఆదిలాబాద్ రీజియన్ కరీంనగర్ జోన్ రాష్ట్ర వ్యాప్తంగా 4వ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం 2,786 మంది భక్తులు తలంబ్రాలను బుక్ చేసుకున్నారు. దీని ద్వారా ఆర్టీసీ సంస్థకు రూ. 4,20,686 ఆదాయం లభించింది. కార్గో మేనేజర్ వెంకట్ నారాయణ భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.


### నిరంకుశ పాలనపై సమరభేరి

## సామాజిక విప్లవకారుడు పాపన్న గౌడ్



**ఆదిలాబాద్‌లో ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అదనపు కలెక్టర్, కార్యాలయ సిబ్బంది**

ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్బంగా మంగళవారం బస్టాండ్ సమీపంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, పాపన్న గౌడ్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ పాపన్న గౌడ్ 18వ శతాబ్దంలోనే నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహా సామాజిక విప్లవకారుడని కొనియాడారు. సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడిగా గుర్తు చేశారు. పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అన్ని వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన ఆయన ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ పాపన్న గౌడ్ ఆశయాలకు అనుగుణంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తూ యువతకు ఆయన చరిత్రను పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, బీసీ అభివృద్ధి అధికారి దరావత్ సోనియా, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.






## తక్కువ ధరకే ప్లాట్ అంటూ బురిడీ

**బాధితుడిపై దాడి చేసి దోచుకున్న ఆటో డ్రైవర్ అరెస్ట్**
**24 గంటల్లోనే కేసును ఛేదించిన మావాల పోలీసులు**
**నిందితుడి నుంచి బైక్ స్వాధీనం...**
**నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం తాగించి**
**రాయితో తలపై బాది మొబైల్, నగదు అపహరణ**
**పాత నేరస్థుడే సూత్రధారి**


ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)
తక్కువ ధరకే ప్లాట్ ఇప్పిస్తానని నమ్మించి, ఓ వ్యక్తిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేసి దోచుకున్న ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని మావాల పోలీసులు కేవలం 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మావాల ఎస్‌హెచ్‌ఓ రాహుల్ కాంత్ వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బాధితుడు కుర్సెంగా మాణిక్రావు (37)కు నిందితుడు సొంకాంబ్లే బయ్యసాహెబ్ (ఆటో డ్రైవర్) పరిచయమయ్యాడు. తక్కువ ధరకే ప్లాట్ చూపిస్తానని మాణిక్రావును నమ్మించి, మార్చి 31 సాయంత్రం దుబ్బగూడ బైపాస్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ బాధితుడికి మద్యం తాగించి, తన వద్ద ఉన్న డబ్బులు, మొబైల్, బైక్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుడు ప్రతిఘటించడంతో, నిందితుడు కోపంతో రాయితో బాధితుడి తలపై బలంగా బాదాడు. మాణిక్రావు స్పృహ తప్పి పడిపోవడంతో అతని వద్ద ఉన్న వస్తువులతో నిందితుడు పరారయ్యాడు. ఏప్రిల్ 1న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మావాల ఎస్‌హెచ్‌ఓ రాహుల్ కాంత్ ఆదేశాలతో ఎస్సై కె. రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. ఏప్రిల్ 2న దాస్నాపూర్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, నంబర్ ప్లేట్ లేని టీవీఎస్ స్పోర్ట్ మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న బయ్యసాహెబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడు బయ్యసాహెబ్ గతంలోనూ పలు నేరాల్లో నిందితుడిగా ఉన్నాడని, 2025లో అతనిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుత కేసులో నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమ్స్ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఆదిలాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే తక్కువ ధర ప్లాట్లు, ఇతర అనుమానాస్పద ఆఫర్లను నమ్మి మోసపోవద్దు. నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారు.

# అడివి శేష్ ఎమోషనల్ లవ్ స్టోరీ..

యంగ్ అండ్ ప్రామిసింగ్ స్టార్ అడివి శేష్ కెరీర్‌లో వైవిధ్యమైన సినిమాలతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తెరపై ఎక్కువగా దేశభక్తి, సస్పెన్స్ థ్రిల్లర్ పాత్రల్లో కనిపించే శేష్ వ్యక్తిగత జీవితంలోనూ ఒక విషాదకరమైన ప్రేమకథ ఉందనే విషయం ఇటీవల బయటకు వచ్చింది. తన గత స్మృతులను గుర్తు చేసుకుంటూ అమెరికాలో చదువుకుంటున్న రోజుల్లో తాను ఒక అమ్మాయితో గాఢమైన ప్రేమలో ఉన్నానని తాజాగా వెల్లడించారు. ఆ సమయంలోనే అడివి శేష్ సినిమాల్లోకి రావాలని, నటుడిగా నిరూపించుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడుట.

ఆ సమయంలో కెరీర్ కంటే కూడా తన ప్రేమకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చానని చెప్పుకొచ్చాడు. ప్రేమించిన అమ్మాయి కోసం తన సమయాన్ని, శ్రమను వెచ్చించడమే కాదు. ఆమెను కలుసుకోవడానికి అమెరికా నుండి కెనడా వరకు ప్రయాణించానన్నాడు. ఆ రోజుల్లో తన ప్రపంచం మొత్తం ఆ అమ్మాయి చుట్టూనే తిరిగేదని భావోద్వేగానికి గురయ్యాడు. ప్రేమ కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధపడిన శేష్ కేవలం ఆమెతో గడపడం కోసం కెనడా వెళ్లడం ఆయనలోని ప్రేమికుడిని చాటిచెబుతోంది. ఒకవైపు సినిమాల కోసం ఆడిషన్లు ఇస్తూనే మరోవైపు తన ప్రేమను కాపాడుకోవడానికి నిరంతరం ప్రయత్నించాడని శేష్ మాటల్లో అర్థమవుతుంది.ఎంతటి గాఢమైన ప్రేమ ఉన్నప్పటికీ విధి వైపరీత్యం వల్ల వారిద్దరి మధ్య కొన్ని అనివార్య కారణాలు తలెత్తాయి. ఆ కారణాల వల్ల వారి ప్రేమ వివాహం వరకు వెళ్లలేకపోయింది. చివరికి ఆ ప్రేమకథ విఫలం కావడంతో అడివి శేష్ తీవ్రమైన మానసిక వేదనకు గురయ్యారు. ఆ బ్రేకప్ తర్వాత తన జీవితంలో ఏర్పడిన వెలితిని భర్తీ చేసుకోవడానికి ఆయన పూర్తిగా సినిమాలపైనే దృష్టి సారించాడు. తనలోని బాధను, ఆవేదనను వెండితెరపై నటన రూపంలో చూపించడానికి ప్రయత్నించాడు. ఆ వైఫల్యమే ఆయనను ఒక పరిపూర్ణమైన నటుడిగా, రచయితగా తీర్చిదిద్దడంలో పరోక్షంగా దోహదపడిందని చెప్పొచ్చు.అడివి శేష్ జీవితంలోని ఈ ప్రేమకథ ఆయన అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తెరపై హీరోగా అందరినీ అలరించే శేష్ నిజ జీవితంలో ఒక సాధారణ ప్రేమికుడిగా ఎదుర్కొన్న ఓటమి ఆయనలోని సున్నితమైన కోణాన్ని ఆవిష్కరించింది. ప్రస్తుతం కెరీర్ పరంగా ఉన్నత స్థాయిలో ఉన్న శేష్ గతాన్ని గౌరవిస్తూనే భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్నాడు. ఆయన రాబోయే చిత్రాల్లో ఈ అనుభవాలు మరిన్ని సహజమైన భావోద్వేగాలను పండిస్తాయని ఆశించవచ్చు. ప్రస్తుతం శేషు హీరోగా నటిస్తోన్న 'డెకాయిట్' రిలీజ్ కు రెడీ అవుతోన్న సంగతి త తెలిసిందే. ఈసినిమా పై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే రిలీజ్ అవ్వాలి. కానీ అనివార్య కారణాలతో వాయిదా పడింది. అలాగే స్పై థ్రిల్లర్ 'గుఢచారి 2' కూడా తెరకెక్కుతోంది. ఆ సినిమా కూడా ఇదే ఏడాది రిలీజ్ కానుంది.





# వేసవిలో పేట్రియాట్

మలయాళ అగ్రహీరోలు మమ్ముట్టి, మోహన్‌లాల్ కలిసి సందడి చేయబోతున్న చిత్రం 'పేట్రియాట్'. మహేశ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు. నయనతార కథానాయికగా నటిస్తోంది. ఈ నెల 23నే ఈ సినిమా రాబోతున్నట్లు ఇప్పటికే వెల్లడించింది చిత్రబృందం. కానీ కొన్ని కారణాలతో దీన్ని వేసవి సందర్భంగా మే 1న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు. బుధవారం ఈ విషయాన్ని తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. దేశభక్తి నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, రేవతి తదితరులు కీలక పాత్రల్లో అలరించనున్నారు.వైవిధ్యమైన పాత్రల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన ఖాతాలో దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న చిత్రం కూడా ఉంది. గతేడాది ప్రకటించిన ఈ సినిమా చిత్రీకరణను ఈ సంవత్సరం డిసెంబరు నెలాఖరులో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "దర్శకుడు ప్రియదర్శన్ 100వ సినిమా ఇది. అందుకే దీన్ని తన కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోయేలా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రం సంగీత ప్రపంచంలోని తండ్రీ కొడుకుల సంబంధాన్ని అన్వేషిస్తుంది. వారి మధ్య విభేదాలు, అహం, ఘర్షణల చుట్టూ తిరుగుతుందీ సినిమా" అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి యాక్షన్ సీక్వెన్స్‌తో అదరగొట్టే మోహన్‌లాల్.. ఈ సంగీత ప్రపంచంలో ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలంటే కొన్నిరోజులు వేచి చూడాల్సిందే.



# సమంత 'పవర్' ఫార్ములా..

స్టార్ బ్యూటీ సమంత తాజాగా తన మార్నింగ్ రొటీన్‌ను అభిమానులతో పంచుకుంది. 'పవర్ మార్నింగ్' అనేది తన జీవితాన్ని ఎంతగానో మార్చిందని చెప్పుకొస్తూ.. 'ఉదయం ప్రశాంతంగా మొదలైతే మిగిలిన రోజంతా ఉత్సాహంగా ఉంటుందని నమ్ముతా. ఇప్పటివరకూ ఎన్నో మార్నింగ్ రొటీన్స్‌ను ఫాలో అయ్యా. చివరకు ఒక సులభతరమైన ఫార్ములాకు అలవాటు పడ్డా. అది ఉపయోగపడింది. అదే నా పవర్ మార్నింగ్. నిద్రలేచే సమయానికి ఒత్తిడికి గురి చేసే హార్మోన్లు ఎక్కువ స్థాయిలో ఉంటాయి. ఇది ఎవరికైనా సాధారణం. కాబట్టి, నిద్ర లేచిన వెంటనే మనం ఏం చేస్తున్నామనేది ముఖ్యం. చాలామంది ఫోన్లు పట్టుకుంటారు. మెయిల్స్ చూడటం, వర్క్ గురించి ఆలోచిస్తారు. దీనివల్ల ఉదయాన్నే మరింత ఒత్తిడికి గురవుతారు.. కానీ ప్రశాంతమైన జీవనం కోసం ఈ ఎనిమిది రూల్స్ ఫాలో అవ్వాలి. నిద్ర లేచిన తర్వాత ఒక గంట పాటు ఫోన్ వాడకపోవడం, ఐదు నిమిషాలు ధ్యానం, సూర్యరశ్మి తగిలేలా కూర్చోవడం, గోరువెచ్చటి నీళ్లలో పసుపు, నిమ్మరసం కలిపి తాగడం, ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్, 11 గంటలలోపే వర్కౌట్లు చేయాలి. ఆ రోజు ఏం సాధించాలనుకుంటున్నామనేది నిర్ణయించుకుని ఒక పుస్తకంలో రాసుకోవాలన్నారు. జీవితంలో మార్పు కావాలనుకునేవారు 21 రోజులపాటు దీనిని ఫాలో అవ్వండి' అంటూ తెలిపింది.





# భక్తిశ్రద్ధలతో.. హనుమాన్ శోభాయాత్ర





## శోభాయమానంగా శోభాయాత్ర

- జిల్లా వ్యాప్తంగా మారుమోగిన ఆంజనేయ నామస్మరణ...
- భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శోభాయమనంగా శోభాయాత్ర
- తరలివచ్చిన అశేష భక్తజనం ■ పోలీసుల భారీ బందోబస్తు







**ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

హనుమాన్ జయంతి వేడుకలు గురువారం జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని అయా ఆలయాల్లో ఘనంగా జరిగాయి. పట్టణంలోని పెద్దవాగు నది తీరాన గల కేస్లాపూర్ హన్‌మాన్ అలయంలో వేద పండితులు శీరిష్‌శర్మ, సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారిని జిల్లా కలెక్టర్ కె హరిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యాంనాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావులతో పాటు ఆయా పార్టీల నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు తారీక్ అధ్వర్యంలో భక్తులకు తాగునీటిని పంపిణీ చేసి మతసామరస్యనికి ప్రతీకగా నిలిచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ బాలజీ వరప్రసాద్ అధ్వర్యంలో పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు సరస్వతి, రాజంపేట సర్పంచ్ బుర్స పోచయ్య, ఉప సర్పంచ్ లక్ష్మి, అలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకన్న, వివేక్, మధు, లక్ష్మణమూర్తి, రమేష్, ఎకిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జూరు మండలంలో వివిధ గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో హింధూ జాగరణ మంచ్ ఆధ్యంలో రంగనాయక ఆలయ ప్రాంగణం నుంచి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో కాషాయ, హనుమాన్ జెండాలతో శోభాయాత్ర నిర్వహవించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్కపల్లి ఆంజనేయ ఆలయంలో జెండావిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. దహెగాం మండల వ్యాప్తంగా భక్తులు హనుమాన్ జయంతిని ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. శివకేశవ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు.. ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. శివాలయం నుంచి పాత దహెగాం హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెంచికలపేట మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్ర పటంతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సరిత రాజన్న ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు.

కాగజ్‌నగర్ పట్టణంలో హను మాన్ జయంతి వేడుకల ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్‌లో ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బజ్ బజరంగ దళ్ సభ్యులు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ శోభా యాత్ర ప్రధాన వీధుల గుండా సాగింది. మహారాష్ట్రలోని డోలు బృందం పతేక ఆకర్షణగా నిలిచింది. కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుదీన్ ఆధ్వర్యంలో ప్రత్యే క పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగజ్ నగర్ పట్నం అంతా జై శ్రీ రామ్ అంటూ మార్మోగింది.

**అంజనేయ స్వామికి కలెక్టర్ హరిత పూజలు...**

హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని కేస్లాపూర్ అంజనేయ స్వామి ఆలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ కె. హరిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా స్వామివారికి నిర్వహించిన అభిషేకాలు, అర్చనలు కార్యక్రమాలలో కలెక్టర్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కలెక్టర్ కు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు. పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారం, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కుభీర్‌లో భక్తిశ్రద్ధలతో హన్‌మాన్ జయంతి వేడుకలు...**

మండల కేంద్రం కుభీర్‌తో పాటు పలు గ్రామాలల్లో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుభీర్‌లో 25 అడుగుల ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భజనలు, మేళతాళాలతో శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది, అంజన్న నామస్మరణతో పాటు శ్రీరామనామ నామస్మరణతో గ్రామాలు దద్దరిల్లాయి. యువకులు కాషాయ వస్త్రాలు ధరించి వీధుల గుండా కాషాయ జెండాలను ఎగురవేశారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్రలో బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, సముద్రాల వేణుగోపాల చారి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నిల అనిల్, మాజీ మార్కుఫెడ్ డైరెక్టర్ రేకుల గంగా చరణ్, నాగభూషణ్ (మణి),మండల నాయకులు, యువకులు, పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతన ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం తానూర్ మండలంలోని బోద్రేడ్, బైంసా మండలంలోని మాంత్రి గ్రామాల్లో హనుమాన్ విగ్ర హ ప్రతిష్టాపన, ద జరోహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు పూజలు నిర్వహించి మాట్లాడారు ముధోల్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- పారదర్శకంగా 'ఇందిరమ్మ' ఇళ్ల ఎంపిక!
- ఉట్నూరు గ్రామసభలో కలెక్టర్ రాజర్షిషా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హామీ
- రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు
- జిల్లాలో రూ.220 కోట్లతో 16 వేల ఇళ్ల మంజూరు
- ఐదేళ్లలో ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారం
- యువతకు శిక్షణ.. మహిళలకు ఆర్థిక తోడ్పాటు
- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో రోబోటిక్స్‌లో ఉపాధి

**ఉట్నూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ప్రజాపాలన – ప్రగతి నివేదికలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతువేదిక లో నిర్వహించిన గ్రామసభ కు ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపిడిఓ రామ్ ప్రసాద్, గ్రామ పంచాయతీ నివేదికను పంచాయతీ కార్యదర్శి శంకర్ గ్రామ సభలో చదివి వినిపించాగా, పలువురు సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉట్నూరు గ్రామ పంచాయతీలో మొదటి విడతగా సుమారు 66 ఇళ్లకు గాను 90 లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16,000 ఇళ్లకు గాను సుమారు 220 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదేళ్లలో ఇళ్లు అందుతాయన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కొత్తగా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని, అలాగే ఉట్నూరు ఐటిఐలో టాటా సంస్థ సహకారంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభమైందని తెలిపారు. దీని ద్వారా 200 మంది యువతకు రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి ఆధునిక అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఉన్న తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు మాట్లాడుతూ,గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా ఇంద్రమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా గెజిటెడ్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా నాలుగు విడతల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి కోసం కొత్త బోరుబావుల మంజూరు వంటి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు ఫోన్లకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తూ, అధికారుల సమన్వయంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, 2047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉట్నూర్ రైతువేదిక సమీపంలోని వెదురు తయారీదారుల ఇళ్లను సందర్శించి, వారి జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువ సమస్య తెలియజేయగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో రామ్ ప్రసాద్, రైతులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఉట్నూరులో కోర్టు భవనం ప్రారంభం!
- భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక చొరవ
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏజెన్సీ కోర్టును ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- గిరిజన ప్రాంతాల్లో న్యాయ సేవలు మరింత చేరువ
- కార్యాలయ విభాగాల పరిశీలన
- ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్‌తో కలిసి రికార్డు గది, కంప్యూటర్ విభాగాల తనిఖీ



**ఉట్నూర్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఏజెన్సీ కోర్టు భవనాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏజెన్సీ కోర్టు సముదాయాన్ని ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్‌తో కలిసి సందర్శించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోనీ రికార్డు గది, కంప్యూటర్ గది, వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి తిరిగి ఈ కోర్టును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, న్యాయవాదులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# నేడు మంత్రి జూపల్లి పర్యటన

**నిర్మల్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడిజిల్లాలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మంచిర్యాల జిల్లాకు చేరుకుంటారు. అక్కడ ప్రజా పాలన పాల్గొని కలెక్టర్ కార్యాలయం లో సమీక్ష చేస్తారు. 1:30 నిమిషాలకు అదిలాబాద్ జిల్లా ఈనెల 6న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను పిప్పిరిలో పరిశీలిస్తారు. అక్కడినుండి బాసర ట్రిబుల్ ఐటీకి చేరుకొని బాసర టెంపుల్ 100 కోట్ల ప్రణాళిక ఏర్పాట్లను పరిశీలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.





# పిప్రికి సీఎం రేవంత్ రాక

- 'పీపుల్ మార్చ్' మూడేళ్ల వేడుకకు భారీ ఏర్పాట్లు!
- డిప్యూటీ సీఎం భట్టి పాదయాత్ర స్మృతులు
- ఈ నెల 6న పిప్రి గ్రామంలో భారీ బహిరంగ సభ
- వివరాలు వెల్లడించిన డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్.
- ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ సోయం బాపురావు పిలుపు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 2 (ప్రభాత సమాచారం)**



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క బజార్హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామం నుండి చేపట్టిన పీపుల్ మార్చ్ పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 6న సీఎం రేవంత్ రెడ్డి పిప్రి గ్రామానికి రానున్నారని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తెలిపారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సోయం బాపురావ్, పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఈనెల 3న జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు రానున్నట్టు తెలిపారు. సీఎం సభ ఏర్పాట్లను మంత్రి పరిశీలించి మీడియాతో మాట్లాడనున్నట్టు వెల్లడించారు. అదే విధంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సైతం ఈనెల 4న జిల్లాకు రానున్నట్టు తెలిపారు. ముందుగా ఆదిలాబాద్ లో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం పిప్రి గ్రామంలో చేపట్టే సీఎం సభ ఏర్పాట్లను ఆయన పరిశీలిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గంద్రత్ సుజాత, సాజిద్ ఖాన్, సంజీవ్ రెడ్డి, బొరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆత్మ చైర్మన్ సంతోష్ రావు తదితరులు పాల్గొన్నారు.